

పులుల సంరక్షణ..ప్రకృతి పరిరక్షణ

పర్యావరణ సమతుల్యతలో పులులు ముఖ్య భూమిక పోషిస్తాయి. వాటిని సంరక్షించుకోవడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు. వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల సందర్భంగా కథనం..

- 8లో..



శనగ రైతులను ఆదుకోవాలి

శనగ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
32/22

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

టీచర్ల పోరుబాట

కూటమి ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతో విద్యావ్యవస్థ గాడితప్పుతోంది. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకపోగా వారిపై బోధనేతర పనుల భారాన్ని మోపుతూ విద్యాబోధనకు దూరం చేస్తోంది. ఫలితంగా విద్యార్థులకు చదువు దూరమవుతోంది. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఉపాధ్యాయులకు సంబంధించిన ఏ ఒక్క సమస్యను పరిష్కరించకపోగా తమపై పనిభారం మోపుతున్నారంటూ టీచర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం పోరుబాట పట్టారు.

- కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ఉపాధ్యాయుల ఆగ్రహం
- సమస్యల పరిష్కారంలో కూటమి విఫలం
- నేడు ఉపాధ్యాయుల 'చలో విజయవాడ'
- అసెస్మెంట్ బుక్‌ను పునఃసమీక్షించాలంటూ డిమాండ్
- సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానం కొనసాగించాలని పట్టు
- బోధనేతర పనులతో పాఠాలకు దూరమవుతున్న టీచర్లు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఫ్యాప్టో నాయకులు (ఫైల్)

ఒంగోలు సిటీ: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత మాటతప్పింది. అడ్డగోలు నిర్ణయాలతో ఉపాధ్యాయుల మీద మరింత ఒత్తిడి పెంచింది. విద్యార్థులకు చదువులు చెప్పకుండా, ఇతర పనులు అప్పగించడంతో సక్రమంగా విధులు నిర్వహించలేకపోతున్నారు. దీంతో ఉపాధ్యాయుల్లో తీవ్రమైన అసంతృప్తి నెలకొంది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రకరకాల పనులను ఉపాధ్యాయులపై రుద్దింది. చంద్రబాబు తన ప్రచార యావతో యోగాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టి ఉపాధ్యాయులను స్కూళ్లకు దూరం చేశారు. అలాగే పేరెంట్, టీచర్స్ సమావేశాల పేరుతో దాదాపు రెండు వారాలపాటు ఉపాధ్యాయులు పాఠాలకు దూరమయ్యారు. దీనికి తోడు రకరకాల శిక్షణ పేరుతో టీచర్లు బడులకు వెళ్లలేక పోయారు. ఫలితంగా విద్యార్థులు సైతం చదువులకు దూరమయ్యారు. కూటమి ప్రభుత్వం ఆంక్షలతో కొంతకాలం మౌనం వహించిన ఉపాధ్యాయ సంఘాలు పోరుకు సిద్ధమయ్యాయి. సమస్యల పరిష్కారం కోసం, హక్కులను కాపాడుకునేందుకు జిల్లాలో సుమారు 11 వేల మంది ఉపాధ్యాయులు ఆందోళనబాటపట్టారు. ఉపాధ్యాయ సంఘాలన్నీ ఏకమై విజయవాడ ధర్నా చౌక్‌లో నేడు రాష్ట్రస్థాయి ధర్నా చేపట్టారు. ధర్నాను విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలి వెళ్లనున్నారు.

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు..డిమాండ్లు ఇవీ..

- ఏకీకృత సర్వీస్ రూల్స్ పరిష్కరించి 72, 73, 74 జీవోలు అమలు చేయాలి.
- పంచాయతీరాజ్‌లో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టి, కలెక్టరు పూల్ ద్వారా వెంటనే పోస్టింగులు ఇవ్వాలి.
- సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి.
- ఉపాధ్యాయులకు బోధన తప్ప బోధనేతర కార్యక్రమాలు లేకుండా చేయాలి.
- విద్యాశక్తి కార్యక్రమం ఐచ్ఛికం అని చెబుతూ బలవంతంగా అమలు చేయడాన్ని విడనాడాలి.
- అసెస్మెంట్ పుస్తకాలను పునః సమీక్షించాలి.
- హైస్కూల్ ప్లస్ లలో వెంటనే ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టి, హైస్కూల్ ప్లస్ పాఠశాలలను యథాతథంగా కొనసాగించాలి.
- 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలి.
- 30 శాతం మధ్యంతర భృతిని (ఐఆర్) వెంటనే ప్రకటించాలి.
- రిటైర్ అయిన వారికి గ్రాట్యుటీ, కమ్యూటేషన్, లీవ్ ఎన్క్యాష్‌మెంట్ వంటి బకాయిలను రిటైర్ అయిన మరుసటి రోజునే చెల్లించాలి.
- సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించి గ్రేడ్–2 పండిట్లు, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలి.
- మున్సిపల్ ఉపాధ్యాయులకు జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలి.
- ఈహెచ్‌ఎస్/మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల విషయంలో నిత్యం ఉత్పన్నమవుతున్న సమస్యలను పరిష్కరించాలి.
- మండల విద్యాశాఖాధికారుల బదిలీలు తక్షణమే చేపట్టాలి
- 2008, 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేసి పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలి.
- బదిలీ అయి సబ్‌స్టిట్యూట్ లేక రిలీవ్ కాని ఉపాధ్యాయులను రిలీవ్ చేయడానికి చర్యలు తీసుకోవాలి.

రాష్ట్ర స్థాయి ధర్నాను విజయవంతం చేయండి



విజయవాడ ధర్నా చౌక్‌లో ఈ నెల 7వ తేదీ రాష్ట్ర స్థాయి ధర్నా విజయవంతం చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయుల బోధనేతర, ఆర్థిక విషయాల మీద ఒక స్పష్టమైన రూట్ మ్యాప్ ప్రకటించాలి. ఉపాధ్యాయులకు బోధన తప్ప ఏ ఇతర బోధనేతర కార్యక్రమాలు లేకుండా చేయాలి. విద్యాశక్తి కార్యక్రమం ఐచ్ఛికం అని చెబుతూ బలవంతంగా అమలు చేయడానికి విడనాడాలి. సెల్ఫ్ అసెస్మెంట్ భారాన్ని తగ్గించాలి. ఆన్‌లైన్ వరకు యాప్‌ల భారాన్ని తగ్గించాలి.

– అబ్దుల్ హై, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఉపాధ్యాయులకు కొత్త సమస్యలు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధ్యాయులకు కొత్త సమస్యలు వచ్చి పడ్డాయి. విద్యార్థులకు చదువు చెప్పడం కంటే కూడా బోధనేతర పనులతోనే తలమునకలయ్యేలా ప్రభుత్వం ఒత్తిడి చేస్తుంది. పెండింగ్ లో ఉన్న ఏకీకృత సర్వీసు నిబంధనలను పట్టించుకోవడం లేదు. దీంతో ఉపాధ్యాయులు ఈ నెల 7వ తేదీ విజయవాడలో ధర్నాకు పిలుపునిచ్చాం. ఐక్య పోరాటాల ద్వారానే ఉపాధ్యాయులు తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక మాట, రాకముందు ఒక మాట మాట్లాడుతోంది.

– శ్రీనివాసులు, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

పోరాటాల ద్వారానే సమస్యలు సాధించుకుంటాం



పోరాటాల ద్వారానే తమ సమస్యలు సాధించుకుంటాం. ఫ్యాప్టో తరఫున విజయవాడలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలి. ఉపాధ్యాయులకు బోధన కంటే బోధనేతర పనులను కేటాయించడం ద్వారా చదువుకు దూరమవుతున్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు కేటాయించకుండా చర్యలు తీసుకోవాలి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి.

– యర్రయ్య, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

టీడీపీలో రేషన్ బియ్యం.. కయ్యం



పొన్నలూరు స్టేషన్‌లో శుక్రవారం పట్టుకున్న రేషన్ బియ్యం ఆటో



జరుగుమల్లి మండలంలో పట్టుకున్న రేషన్ బియ్యం ఆటో (ఫైల్)

- రెండు నియోజకవర్గాల ముఖ్య నాయకుల మధ్య వివాదం
- కొండపి టీడీపీ నేత అక్రమ దందాలో కావలి నేత జోక్యం
- అక్రమ దందాతో కొండపి నేతకు నెలకు రూ.25 లక్షలు
- కావలి నాయకుడి అనుచరుల రాకతో ఆదాయానికి గండి
- దీంతో అక్రమ రవాణాను పోలీసులకు పట్టించిన వైనం
- కేసు వద్దన్న కావలి నేత.. పెట్టించిన కొండపి నాయకుడు

సాక్షి నెట్‌వర్క్, ఒంగోలు: రేషన్ బియ్యం అక్రమ రవాణా దందా రెండు నియోజకవర్గాలకు చెందిన టీడీపీ ముఖ్య నాయకుల మధ్య చిచ్చుపెట్టింది. చివరకు వివాదంగా మారింది. ఆ వివరాలు... కొండపి నియోజకవర్గం పొన్నలూరు మండలం కె.అగ్రహారం రేషన్ షాపు నుంచి 53 బస్తాల బియ్యాన్ని కావలి నియోజకవర్గ ప్రజాప్రతినిధి ముఖ్య అనుచరులు ఈ నెల 3న అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. కొండపిలోని అన్ని మండలాల్లో డీలర్ల నుంచి రేషన్ బియ్యం కేజీ రూ.20 చొప్పున కొని తీసుకెళ్తున్నారు. అయితే, కొండపిలో రేషన్ బియ్యం అక్రమ దందాను మంత్రి లోకేష్‌కు సన్నిహితంగా ఉండే, నామినేటెడ్ పోస్టులోని నాయకుడు నడిపిస్తున్నారు. ఆయన అనుచరులు సింగరాయకొండ కేంద్రంగా రేషన్ మాఫియా సాగిస్తున్నారు. దీనికిగాను ఆ యువ నేతకు నెలకు రూ.25 లక్షలను ఓ రైస్ మిల్లు యజమాని అందజేస్తున్నట్లు సమాచారం. డీలర్లు కార్డుదారులకు బియ్యం బదులు నగదు ఇస్తూ భారీగా బియ్యం పక్కదారి పట్టిస్తున్నారు. డీలర్ నుంచి కిలో రూ.15– రూ.16కు కొండపి నేత అనుచరులు కొంటున్నారు. 12 వేల బస్తాల రేషన్ బియ్యం నెలనెలా అక్రమంగా రవాణా అవుతోంది. అయితే, కావలి నేత అనుచరులు కేజీకి రూ.20 ఇస్తుండటంతో డీలర్లు వారివైపు మొగ్గుచూపారు. ఇది కొండపి నియోజకవర్గ నేతకు వచ్చే ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపింది. ఇలా ఎందుకు జరిగింది? అని ఆయన ఆరా తీయగా... కావలి టీడీపీ నాయకుల దందా బయటపడింది. దీంతో పొన్నలూరు మండలంలో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై పోలీసులకు ఉప్పందించారు. వారు వెళ్లి వాహనాన్ని పట్టుకున్నారు.

ఆయన పోలీసులకు పట్టించారు.. ఈయన కేసు వద్దన్నారు

తన అనుచరుల బియ్యం అక్రమ దందాకు అడ్డుకట్టపడడంతో వెంటనే కావలి ప్రజాప్రతినిధి రంగంలోకి దిగారు. కొండపి నుంచి రాష్ట్ర స్థాయి కీలక పదవిలో ఉన్న నాయకుడికి ఫోన్ చేశారు. కేసు లేకుండా తమవాళ్ల వాహనాన్ని వదిలేయాలని కోరారు. కేసులు పెడితే మీ బియ్యం లారీలు మా నియోజకవర్గం మీదుగా వెళ్లలేవని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో కొండపి కీలక నాయకుడు.. కేసులు పెట్టవద్దని పోలీసులకు ఆదేశాలిచ్చారు. కానీ, నామినేటెడ్ పదవిలో ఉన్న నేత కల్పించుకుని కేసులు పెట్టాలని పట్టుబట్టారు. ఈ పరిస్థితిలో పోలీసులకు ఏం చేయాలో పాలుపోలేదు. చివరకు, ‘‘రేషన్ బియ్యం అక్రమ రవాణా సమాచారం మేరకు వెళ్లి వాహనాన్ని పట్టుకున్నాం. అందులో గోతాలు, పట్టాలే ఉన్నాయి. వాహనాన్ని స్టేషన్‌కు తరలించాం’’ అని వెల్లడించారు. కానీ, రేషన్ దందా బట్టబయలవడంతో ఎస్సై అనూక్ సోమవారం వివరణ ఇచ్చారు. ముప్పాళ్ల అడ్డరోడ్డు వద్ద తనిఖీల్లో 40 బస్తాల బియ్యాన్ని పట్టుకుని ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు అప్పగించామన్నారు. కేసు పెట్టామని చెప్పారు. శుక్రవారం పట్టుకున్న బియ్యానికి సోమవారం కేసు నమోదు, వాహనంలో బియ్యమే లేవని చెప్పి ఇప్పుడు 40 బియ్యం బస్తాలు పట్టుకున్నామని చెప్పడం గమనార్హం. మరోవైపు రేషన్ బియ్యం కె.అగ్రహారం నుంచి రవాణా అవుతుంటే... కనిగిరి వైపు నుంచి వస్తుండగా ముప్పాళ్ల అడ్డరోడ్డు వద్ద పట్టుకున్నామనడంతో ఏంజరిగిందో తెలిసిపోయింది. కొసమెరుపు ఏమంటే... ఆదివారం కావలి టీడీపీ నేతలు కొండపి నియోజకవర్గం జరుగుమల్లి మండలంలో 80 బస్తాల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని కేసు పెట్టారు.

అమ్ముతాం ఆపేదెవరు !



రాత్రి వేళలో మద్దిపూడిలోని 2 వ నంబరు రేషన్ దుకాణం నుంచి బియ్యం బస్తాలు మోసుకెళుతున్న దృశ్యం



పేదలబియ్యాన్ని లారీలోకి లోడ్ చేస్తున్న కూలీలు

- యథేచ్ఛగా నల్లబజారుకు పేదల బియ్యం

మద్దిపూడి: కూటమి నేతల కనుసన్నల్లో సాగుతున్న రేషన్ దుకాణాల నుంచి రేషన్ బియ్యం యథేచ్ఛగా బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తున్నారు. రేషన్‌దుకాణాల నిర్వాహకులు పేదల నుంచి ప్రతినెలా ఇంటికి సైతం వెళ్లి వేలుముద్రలు సేకరించి బియ్యం పంపిణీ చేయకుండా వారికి కిలో బియ్యం రూ.10 వంతున చెల్లిస్తున్నారు. మిగిలిన బియ్యాన్ని రాత్రిపూట లారీలుపెట్టి దుకాణంలోని సరుకును లోడ్‌చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. విషయం అంతా తెలిసినా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మద్దిపూడి మండలంలో 24 చౌకదుకాణాలు ఉండగా, 13,114 రేషన్‌కార్డులు ఉన్నాయి. సుమారు 39,342 టన్నుల బియ్యం, 6 వేల టన్నుల చక్కెర రేషన్ దుకాణాలకు ప్రతి నెలా ప్రభుత్వం కేటాయిస్తుంది. ఇందులో 80 శాతం బియ్యం బ్లాక్‌మార్కెట్‌కు తరలుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఈ నెల 4, 5 తేదీల్లో మద్దిపూడిలో 2వ నంబరు దుకాణందారుని భర్త నేరుగా లారీని దుకాణం ఎదురు నిలిపి పేదలకు పంచాల్సిన సరుకును లారీలో నింపి బ్లాక్ మార్కెట్‌కు తరలించారు. 15 వ తేదీ దాకా కార్డుదారులకు అమ్మాల్సిన బియ్యాన్ని ముందే స్టాక్‌ను ఎత్తివేయడం గమనార్హం.

ఉరుములు, మెరుపులతో బెంబేలు

- ఒంగోలు నగరం, పరిసరాల్లో పిడుగులు, కుండపోత వాన
- మరోపక్క విద్యుత్ కోతలతో ప్రజల అవస్థలు
- నగర వీధులు జలమయం

ఒంగోలు సబర్బన్:

జిల్లాలోని తీర ప్రాంత మండలాలతో పాటు ఇతర ప్రాంతాల్లో ఆదివారం రాత్రి, సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి మొత్తం పెద్ద శబ్దాలతో ఉరుములు, మెరుపులతో ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేశాయి. ప్రధానంగా సముద్ర తీర ప్రాంత మండలాలతో పాటు వాటికి ఆనుకొని ఉండే మండలాల్లోనే ఈ పరిస్థితి నెలకొంది. కొత్తపట్నం మండలంలో 72.4 మిల్లీ మీటర్లు, చీమకుర్తి 72 మిల్లీ మీటర్లు, ఒంగోలు రూరల్ 62.6, ఒంగోలు అర్బన్ 62.6, మద్దిపాడు 48.8, నాగులుప్పలపాడు 40.6, సంతనూతలపాడు 39.8, టంగుటూరు 33.6, మద్దిపూడి 26 మి.మీ, పొదిలి, సింగరాయకొండ, జరుగుమల్లి మండలాల్లో వర్షం కురిసింది. వర్షానికి ఈదురుగాలులు కూడా తోడయ్యాయి.



ఒంగోలు నగరంలో కురుస్తున్న వాన

ఒంగోలు నగరంతో పాటు పలు మండలాల్లో ఆదివారం అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేశారు. తీర ప్రాంత మండలాలలోని పలు గ్రామాల్లో కూడా ఉదయం 8 గంటలకు వరకు కూడా విద్యుత్ సరఫరా చేయలేదు. ఒంగోలు నగరంలో కొన్ని ప్రాంతాల్లో ఉదయం 8 గంటలకు తీసి 10 గంటలకు విద్యుత్‌ను ఇచ్చారు. ఒక పక్క ఉరుములు, మెరుపులతో ఉక్కిరిబిక్కిరి అవుతుంటే విద్యుత్ లేక ప్రజలు నానా అవస్థలు పడ్డారు.

న్యూస్‌రీల్

నేడు ఎస్‌జీఎఫ్ వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: ఎస్‌జీఎఫ్ అండర్ 14, 17 జిల్లా క్రీడాకారుల ఎంపిక ఈనెల 7న స్థానిక భారత జాతీయ వ్యాయామ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్ 14, 17 జిల్లా కార్యదర్శి చక్కా వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభమవుతుంది. అండర్ 17 విభాగంలో పాల్గొనే కాలేజీ క్రీడాకారులు తప్పనిసరిగా పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్‌ను ప్రిన్సిపాల్‌చే ధ్రువీకరించి పంపాలని విజ్ఞప్తి చేశారు.

9న ఎస్‌జీఎఫ్ అండర్ 19 సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ జట్ల ఎంపిక

ఒంగోలు: ఈనెల 9న అండర్ 19 ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 కార్యదర్శి చింపారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక స్థానిక ఏబీఎం కాలేజీ ఆవరణలో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుంది. 2007 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన వారు, ఇంటర్మీడియెట్ చదువుతున్న వారు మాత్రమే పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్‌తో ఎంపిక ప్రక్రియకు హాజరుకావాలని, పూర్తి వివరాలకు ఫిజికల్ డైరెక్టర్ బొడ్డు సుబ్బారావు, సెల్ నంబర్ 9949346536ను సంప్రదించాలని ఎస్‌జీఎఫ్ అండర్ 19 జిల్లా కార్యదర్శి చింపారెడ్డి పేర్కొన్నారు.

తాత్కాలిక క్రాకర్స్ లైసెన్స్ దరఖాస్తు గడువు పెంపు

ఒంగోలు సబర్బన్: దీపావళి పండుగను పురస్కరించుకొని జిల్లాలోని బాణాసంచా విక్రయించేందుకు ఆసక్తి గల వ్యాపారులు తాత్కాలిక క్రాకర్స్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవటానికి గడువును పొడిగిస్తూ డీఆర్వో సీహెచ్.ఓబులేసు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 9వ తేదీ వరకు తాత్కాలిక క్రాకర్ లైసెన్స్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తొలుత 5వ తేదీలోపు మీసేవ కేంద్రాలు/ గ్రామ –వార్డ్ సచివాలయ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అనుమతి ఇచ్చారు. అందుకుగాను చిరునామా ప్రూఫ్ నకలు, ఆధార్ నకలు, మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, జనన ధ్రువీకరణ పత్రం, అఫిడవిట్ (రూ.10 స్టాంప్ పేపర్ పై నోటరీ చేయించాలి), వాణిజ్య శాఖ అధికారి ఎన్‌ఓసీ, పోలీసు శాఖ వారి ధ్రువీకరణ పత్రం, విపత్తు ప్రతిస్పందన, అగ్నిమాపక విభాగం నుంచి ధ్రువీకరణ పత్రం, స్థానిక సంస్థల నుంచి ధ్రువీకరణ పత్రం (పంచాయతీ / మున్సిపాలిటీ)ఈ పత్రాలన్నింటినీ దరఖాస్తుతో జతపరచాలి. 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు బాణాసంచా సామగ్రి అమ్మకాలు జరపాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు:

దీపావళి పండుగ సందర్భంగా ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని డీఆర్‌ఓ విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అగ్నిమాపక, రెవెన్యూ, పోలీస్, మునిసిపల్, పంచాయతీ తదితర శాఖల అధికారులు స్వయంగా పర్యవేక్షించి ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

నూతన ఎయిడెడ్ టీచర్లకు ప్రాన్ నంబర్ ఇవ్వాలి

- టీచర్స్ గిల్డ్ వినతి

ఒంగోలు సిటీ: నూతన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు ప్రాన్ నంబర్ కేటాయించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరావు, సీహెచ్.ప్రభాకరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 2004 తర్వాత సర్వీసులో చేరిన ఎయిడెడ్ ఉపాధ్యాయులు, విడతల వారీగా 2014, 2017, 2023, 2024 సంవత్సరాల్లో సర్వీస్‌లో చేరి ప్రస్తుతం కొంతమంది ఉపాధ్యాయులు మినిమం టైమ్ స్కేల్ పద్ధతిలో పనిచేస్తున్నారని తెలిపారు. వారికి సంబంధించి జిల్లా విద్యాశాఖ అధికారి ప్రాన్ నంబర్ కేటాయిస్తే వారికి సంబంధించిన అరియర్లు వారి ఖాతాలో జమవుతాయని తెలిపారు. ఉపాధ్యాయులకు ప్రాన్ నంబర్ కేటాయిస్తే హెల్త్ కార్డులు కూడా అప్లోడ్ అవుతున్నాయని, వారికి ప్రొసీడింగ్ ఇవ్వవలసినదిగా జిల్లా విద్యాశాఖ అధికారిని కోరారు.

గోవిందయ్య జోలికి వెళ్తే ఊరుకోం

- మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు

సాక్షి, అమరావతి: గంగాధర నెల్లూరు అంబేడ్కర్ విగ్రహం కాలిపోయిన ఘటనలో ఫిర్యాదు చేసిన దళితుడైన గోవిందయ్యను విచారణ పేరుతో నిర్బంధించడాన్ని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు తీవ్రంగా ఖండించారు. ఆయన జోలికి వచ్చినా .. గోవిందయ్యపై కేసులు బనాయించిన చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ‘‘చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు సెగ్మెంట్ పరిధిలో వెదురుకుప్పం మండలం బొమ్మాయపల్లి పంచాయతీ దేవళంపేట అనే గ్రామంలో తమ పార్టీకి సంబంధించిన గోవిందయ్య, 2023 సంవత్సరంలో 10 అడుగుల అంబేడ్కర్ విగ్రహం స్థాపించారు. సర్పంచిగా ఉండి అనేక మంచి పనులు చేసిన ఆయనకు టీడీపీ నాయకుడు సతీష్ నాయుడుతో రాజకీయపరమైన వైరం ఉంది. ఈ విగ్రహం పెట్టే రోజు కూడా సతీష్ నాయుడు అడ్డుకోబోయాడు. విగ్రహం పెట్టడానికి వీల్లేదని పెట్టనీకుండా ఉండేందుకు అన్ని ప్రయత్నాలు చేశాడు. విగ్రహ స్థాపన రోజు నుంచి ఆ విగ్రహాన్ని ఏవిధంగా తొలగించేందుకు సతీష్ నాయుడు ప్రయత్నిస్తున్నాడు. ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి సొంత నియోజకవర్గం ఇది. స్థానిక ఎమ్మెల్యే థామస్ అండతోనే ఈ ఆరాచకాలు చేస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి అంబేడ్కర్ విగ్రహాన్ని కాల్చివేశారు. విగ్రహం పెట్టినప్పటి నుంచి వ్యతిరేకిస్తున్న టీడీపీ మూకలు ఏవిధంగానైనా ఆ విగ్రహాన్ని తొలగించాలని కుట్రతో ఈ ఘటనకు పాల్పడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సొంత జిల్లాలో ఈ దారుణం జరిగింది. బాబుకు మొదటి నుంచి దళిత వ్యతిరేక విధానం ఉంది. టీడీపీ అమలు చేసిన పథకాల వల్ల దళిత సమాజానికి ఎలాంటి మేలు జరగటం లేదు. విగ్రహం తగుల బెట్టించింది కాక గోవిందప్ప ఇంటిపై పోలీసులు దాడి చేసి, నీవే తగులబెట్టావ్ అని ఒప్పుకో కేసులు లేకుండా చేస్తాం అంటున్నారు. సర్పంచ్‌ని అలా బెదిరిస్తే చూస్తూ ఊరుకోము. చంద్రబాబును గద్దెదింపే దాకా ఈ దళిత సమాజం నిద్రపోదు. సీసీ టీవీ పుటేజీ తీయండి. నిజనిర్ధారణ చేయండి. అసలైన నిందితుడిని పట్టుకోవాలని'' మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు డిమాండ్ చేశారు.



టీజేఆర్ సుధాకర్ బాబు

క్లుప్తంగా

12వ పీఆర్‌సీ వెంటనే నియమించాలి


- పెన్షనర్ల అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో తీర్మానం



పెన్షనర్ల కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న అంకిరెడ్డి

ఒంగోలు సబర్బన్: ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్‌సీని నియమించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ల అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. స్థానిక ప్రభుత్వ పెన్షనర్ల సంఘ భవనంలో సోమవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు బోడా అంకిరెడ్డి మాట్లాడుతూ పీఆర్‌సీని నియమించి ఐఆర్‌ను 30 శాతం ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలలో రెండింటిని వెంటనే ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, డీఆర్ అలవెన్స్, 11వ పీఆర్‌సీ బకాయిలను వెంటనే విడతల వారీగా చెల్లించాలన్నారు. అన్ని నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో ఈహెచ్‌ఎస్ కార్డుపై అన్ని వ్యాధులకు క్యాష్‌లెస్ వైద్యం అందించాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సమావేశంలో తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి కె.సుబ్బారావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

40 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



పొన్నలూరులో పోలీస్‌స్టేషన్‌లో అక్రమ బియ్యంతో పట్టుబడిన వాహనం

పొన్నలూరు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని పొన్నలూరు పోలీసులు మూడు రోజుల కిత్రం పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక పోలీసులు గత శనివారం ముత్తరాసుపాలెం సమీపంలోని ముప్పాళ్ల అడ్డరోడ్డు వద్ద ఓవీ రోడ్డుపై వాహనాలు తనిఖీ చేస్తుండగా కనిగిరి నుంచి కందుకూరు వైపు మినీ ట్రక్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 40 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. పట్టుకున్న బియ్యాన్ని సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై అనూక్ తెలిపారు. అక్రమ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంబంధిత వ్యక్తులపై 6ఏ కేసు నమోదు చేశారు. బియ్యం బస్తాలను స్థానిక రేషన్ షాపుకు తరలించారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

వెలిగండ్ల(కనిగిరిరూరల్): ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండలంలోని గోకులంలో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే..గ్రామానికి చెందిన ఎన్ సుజాత (35) ఇంట్లో ఎవ్వలేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్సై కృష్ణపావని సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి కారణాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

పంటకాల్వలో పడి బాలుడు మృతి



బాలుడి మృతదేహం

కంభం: కాలువలో పడి బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం కంభంలో జరిగింది. వివరాల్లోకి వెళితే..మండలంలోని పెద్దనల్లకాల్వ గ్రామానికి చెందిన బోధనం రవిశేఖర్ ట్రాక్టర్‌తో పొలం దున్నుతూ తన కుమారుడు అశ్వంత్(12)ను పొలం పక్కనే పంట కాలువ గట్టుపై కూర్చోపెట్టాడు. కొద్దిసేపటి తర్వాత చూడగా పిల్లవాడు కనిపించకపోవడంతో పిల్లవాడు ఫిట్స్ వచ్చి కాలువలో పడిపోయినట్లు గుర్తించి కంభం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చాడు. పరీక్షించిన వైద్యులు చనిపోయినట్లు నిర్ధారించారు. చనిపోయిన బాలుడి స్థితి మానసికంగా బాగాలేదని తెలిసింది.

పులుల సంరక్షణ.. ప్రకృతి పరిరక్షణ

- నల్లమలలో 87 పెద్దపులులు
- 32 బేస్ క్యాంపులు ఏర్పాటు
- పులుల రక్షణలో 295 సిబ్బంది
- ప్రత్యేకంగా స్ట్రైకింగ్ ఫోర్సు ఏర్పాటు
- వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల సందర్భంగా..



అటవీ ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేస్తున్న సిబ్బంది



నల్లమలలో సంచరిస్తున్న పెద్దపులి

మార్కాపురం:

పర్యావరణ సమతుల్యతలో పులులు ముఖ్య భూమిక పోషిస్తాయి. వాటిని రక్షించుకోవడం ద్వారా పర్యావరణాన్ని, ప్రకృతిని కాపాడుకోగలం. జీవవైవిధ్యం దెబ్బతింటే మనిషి ఉనికికే ప్రమాదంగా మారుతుంది. ఈ క్రమంలో ఏటా అక్టోబర్ 2 నుంచి 8వ తేదీ వరకు వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో నల్లమల అటవీ ప్రాంతంలో ఉండే పులులు వాటి జీవనశైలిపై ప్రత్యేక కథనం.

పెద్దపులుల రక్షణకు ప్రత్యేక దృష్టి

దేశంలోనే అతిపెద్దదైన నల్లమల టైగర్ రిజర్వు ఫారెస్టులో 87 పెద్ద పులులు ఉన్నట్లు అంచనా వేశారు. నల్లమల అటవీ ప్రాంత పరిధిలో ఉండే మార్కాపురం, ఆత్మకూరు, గిద్దలూరు, నంద్యాల పరిధిలో పెద్దపులుల రక్షణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్సు ఏర్పాటుచేశారు. నల్లమల పరిధిలోని 4 అటవీశాఖ డివిజన్లకు ప్రస్తుతం డీఎఫ్‌ఓ స్థాయి అధికారులు ఉన్నారు. మార్కాపురం అటవీశాఖకు డిప్యూటీ డైరెక్టర్ హోదా అధికారి పర్యవేక్షిస్తున్నారు. వీరి పరిధిలో డీఆర్‌ఓలు, రేంజ్ ఆఫీసర్లు, బీటు ఆఫీసర్లు, గార్డులు వీరితో పాటు ప్రత్యేక బృందాలు పులుల సంరక్షణ కోసం పనిచేస్తున్నారు. మొత్తం 295 మంది సిబ్బంది పులుల సంరక్షణలో ఉన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో 32 బేస్‌క్యాంపులు ఏర్పాటుచేశారు. అటవీ ప్రాంతం మొత్తాన్ని 7 రేంజ్‌లుగా విభజించి 7 స్ట్రైకింగ్ ఫోర్సులను ఏర్పాటుచేశారు.

అతిపెద్ద టైగర్ రిజర్వు

మార్కాపురం డివిజన్ పరిధిలో మార్కాపురం, యర్రగొండపాలెం, మాచర్ల, నాగార్జునసాగర్ ప్రాంతాలున్నాయి. వీటి పరిధిలో 87 పెద్దపులులు ఉన్నాయి. మన రాష్ట్రంలో ఏకైక టైగర్ రిజర్వు అయిన నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వు ఫారెస్టు 5360.22 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగి దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వుగా గుర్తింపు పొందింది. ప్రత్యేక పర్యావరణ వ్యవస్థ, సహజసిద్ధమైన గొప్ప జీవ వైవిధ్యాల ప్రాంతంగా నల్లమలకు గుర్తింపు వచ్చింది. నల్లమల అటవీ ప్రాంతంలో కృష్ణానది సుమారు 200 కిలోమీటర్ల పొడవునా ఈ రిజర్వులో ప్రవహిస్తోంది. ప్రస్తుతం ఎన్‌ఎస్‌టీఆర్ (నాగార్జునసాగర్ టైగర్ రిజర్వు ఫారెస్టు) లో 87 పెద్దపులులు ఉన్నాయి. పెద్దపులులు దక్షిణాది వైపు సంచరిస్తూ శేషాచలం బయోస్పియర్ రిజర్వులో తమ ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. వన్యప్రాణుల వేటను నిరోధించేందుకు వన్యప్రాణ వేట నిరోధక శిబిరాలను (యాంటీ పోచింగ్ క్యాంప్)ఏర్పాటు చేసి 295 మంది సిబ్బందితో పాటు అధనంగా చెంచు గిరిజనులను సంరక్షకులుగా, స్వచ్ఛ సేవకులుగా చెక్‌పోస్టుల్లో, అటవీ ప్రాంతాల్లో నియమించారు. పులుల పరిరక్షణలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. శ్రీలంకామల్లేశ్వర వన్యప్రాణ అభయారణ్యం, పెంచల నరసింహ వన్యప్రాణుల అభయారణ్యం, వెంకటేశ్వర జాతీయ ఉద్యానవనం పులుల సంరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఈ మూడు ప్రాంతాలు సుమారు 9335.78 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగి భవిష్యత్‌లో పులులు తమ ఆవాసాలను ఏర్పరుచుకునే వాతావరణానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయి. నల్లమలలో ఇప్పటికే 32 బేస్ క్యాంపులు ఏర్పాటుచేశారు. 2022లో ఏడాది దాదాపు 73 పెద్ద పులులు ఉండగా, గత ఏడాది ఈ సంఖ్య 80కి పెరిగింది. ఈ సంవత్సరం ఇప్పుడు 87కి చేరింది. పులుల సంరక్షణకు తీసుకునే చర్యలతో పులుల సంఖ్య పెరుగుతోంది. గత మూడేళ్లుగా అటవీ ప్రాంతంలో గడ్డి పెంపకం వల్ల పొదలు ఏర్పడ్డాయి. జింకలు, దుప్పుల సంఖ్య పెరిగింది. వీటి వలన పెద్దపులుల సంఖ్య కూడా పెరిగింది.

బేస్ క్యాంపుల ఏర్పాటు..

అటవీ ప్రాంతంలో ఉన్న టైగర్ వాచర్స్ నిరంతరం అడవిలో తిరుగుతూ పులుల సంరక్షణపై దృష్టి పెట్టి పులుల కదలికలను ట్రాక్ చేస్తారు. సీసీ కెమెరాల ద్వారా పెద్దపులుల కదలికలను పరిశీలిస్తుంటారు. పులుల సంరక్షణ కోసం బేస్ క్యాంప్‌లు ఏర్పాటు చేశారు. గంజివారిపల్లె సమీపంలోని పెద్దన్న బేస్ క్యాంప్, నారుతడికల, పాలుట్ల, ఇష్టకామేశ్వరీ, దొరబైలు, కొలుకుల, తుమ్మలబైలు, వెదురుపడియ, చినమంతనాల, రోళ్లపెంట, కొర్రపోలు, తదితర ప్రాంతాల్లో బేస్ క్యాంప్‌లు ఉన్నాయి. ఇందులో అటవీశాఖ సిబ్బంది ఉంటారు. అడవిలోకి ఎవ్వరూ వెళ్లకుండా ఉండేందుకు కొర్రపోలు, శిరిగిరిపాడు, దోర్నాల గణపతి గుడి వద్ద ఫారెస్ట్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఇక రాత్రిపూట శ్రీశైలం వెళ్లే ప్రయాణికులను దోర్నాల చెక్‌పోస్టు వద్ద రాత్రి 9 గంటలకే నిలిపి వేస్తున్నారు. తెలంగాణ ప్రాంత నుంచి వచ్చే వాహనాలను కూడ ఈగలపెంట వద్ద 9 గంటలకు నిలిపి వేస్తున్నారు. ఇలా చేయటం వల్ల రాత్రిపూట పెద్దపులులు స్వేచ్ఛగా తిరిగే అవకాశం ఉంది.

పులుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి:



నల్లమల అటవీ ప్రాంతం పరిధిలో పులుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. అటవీప్రాంత పరిధిలోని రోడ్లపై నిత్యం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. నిరంతరం 7 స్ట్రైకింగ్ ఫోర్సులో ఉన్న సిబ్బంది ఆకస్మికంగా తనిఖీలు చేస్తారు. వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్నాం. పెద్దపులులు, చిరుతలు, ఇతర వన్యప్రాణులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వండి. ఉచ్చులు, వలలు వేసి వన్యప్రాణులను వేటాడితే నాన్ బెయిలబుల్ వారెంట్ కింద కేసులు నమోదుచేస్తాం. వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత.

అబ్దుల్ రవూఫ్, డిప్యూటీ డైరెక్టర్, మార్కాపురం అటవీశాఖ

ప్రజల సొమ్ము ప్రైవేట్‌కు కట్టబెట్టడమే పీ3

- మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్వహించాలి
- ప్రజా సంఘాల నాయకుల డిమాండ్



సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓకు వినతిపత్రం ఇస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మార్కాపురం: ప్రజల సొమ్మును ప్రైవేట్‌కు కట్టబెట్టడమే పీ3 ముఖ్య ఉద్దేశమని, ప్రభుత్వమే మెడికల్ కళాశాలను నిర్వహించాలని ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం సీపీఎం పట్టణ కార్యదర్శి డీకేఎం రఫీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ మార్కాపురం మెడికల్ కాలేజీని పీ3 విధానంలో నిర్వహిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించిందని, దీన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. అతి తక్కువ ఖర్చుతో త్వరగా పూర్తికావడానికి అవకాశమున్న మార్కాపురం మెడికల్ కాలేజీని ప్రైవేట్ వారికి అప్పగించడం మంచి పద్ధతి కాదన్నారు. 66 ఏళ్ల పాటు వైద్యశాలను ప్రైవేట్ వారికి అప్పగించడమంటే వైద్య రంగాన్ని ప్రజలకు దూరం చేయడమేనన్నారు. కూటమి నాయకులు గత ప్రభుత్వంలో మెడికల్ కాలేజీని సీట్ల అమ్మడాన్ని వ్యతిరేకిస్తూ ప్రభుత్వమే కళాశాలను నిర్వహించాలని డిమాండ్ చేశారని, ఇప్పుడేమో మాట మార్చి మొత్తం వైద్యకళాశాలనే కార్పొరేటర్లకు అప్పగిస్తున్నారని విమర్శించారు. కార్పొరేటర్ల ప్రయోజనం కోసమే వైద్యరంగాన్ని ప్రభుత్వరంగంగా కాకుండా ప్రైవేట్ వారికి మేలు చేయడమే అన్నారు. అత్యంత వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలో సరైన వైద్యం అందక అనేక మంది సుదూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. కేంద్రంలోని బీజేపీ విధానాలకు తలొగ్గి మోడీ బాటలో పయనిస్తున్న టీడీపీ కూటమి ప్రభుత్వం తన పీ3 విధానాన్ని వెనక్కి తీసుకుని ప్రభుత్వమే నిర్మించాలన్నారు. ఎకరా 1 రూపాయితో వందల ఎకరాల ప్రజల భూమిని 66 ఏళ్ల లీజుకు ఇవ్వడమంటే ప్రజల సొమ్మును ప్రైవేట్ వారికి అప్పజెప్పడం కాదా అని విమర్శించారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి కార్యాలయ ఏఓ రవీంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు అందె నాసరయ్య, ఎస్‌కే ఖాశీం, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సోమయ్య, రఫీ, గుమ్మా బాలనాగయ్య, ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రజాక్, ఆమ్‌ఆద్మీపార్టీ జిల్లా అధ్యక్షుడు వి.సుదర్శన్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఇమ్రాన్, మాబూవలి, కాశయ్య, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం

- వెంటనే పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి
- సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రదర్శనలో పాల్గొన్న రైతులు

మార్కాపురం: మార్కాపురంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని రైతు సంఘం జిల్లా నాయకుడు దగ్గుబాటి సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేసి అనంతరం వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ మార్కాపురం రెవెన్యూ డివిజన్‌లో వేలాది ఎకరాల్లో రైతులు విరివిగా పత్తిని సాగు చేశారని, గిట్టుబాటు ధరలు కల్పించి రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడంతో గ్రామాల్లో ప్రైవేట్ పత్తి వ్యాపారులు ప్రవేశించి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారన్నారు. మార్కాపురం మార్కెట్‌యార్డులో సీసీఐ ఆధ్వర్యంలో వెంటనే పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటా రూ.8,110లుగా ప్రకటించినా ఒక్క క్వింటా కూడా రైతుల నుంచి కొనుగోలు చేయలేదన్నారు. ప్రైవేట్ వ్యాపారుల దోపిడీ నుంచి రైతులను కాపాడాలని కోరారు. గ్రామాల్లో క్వింటా పత్తిని రూ.5,500 నుంచి 6,500 మధ్యనే కొనుగోలు చేస్తుండటంతో రైతులు నష్టపోతున్నారన్నారు. రైతు సంఘం నాయకులు జి రాజశేఖర్‌రెడ్డి, ఏరువ పాపిరెడ్డి, డి.తిరుపతిరెడ్డి, రైతులు లక్ష్మీనాయక్, కాశిరెడ్డి, వెంకట రమణ, నాగేశ్వరరావు, ఓర్సు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీపీఓగా సుధాకరరెడ్డి

ఒంగోలు సబర్బన్: జిల్లా ప్లానింగ్ విభాగంలో చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌గా కె.సుధాకర రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ సిటీస్ ప్రమోషన్ అండ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తూ జిల్లాకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు కలెక్టరేట్‌లోని సీపీఓ కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న స్వరూపారాణి ఎఫ్ఏసీతో ఇన్‌చార్జ్ సీపీఓగా విధులు నిర్వర్తించారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం

- ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ఒంగోలు టౌన్: ప్రజా సమస్యల వేదికకు ఎంతో నమ్మకంతో వస్తున్న బాధితుల సమస్యల పరిష్కారానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమానికి 66 ఫిర్యాదులు వచ్చాయి. బాధితులతో ఎస్పీ నేరుగా మాట్లాడి ఫిర్యాదులు స్వీకరించారు. సమస్య పూర్వాపరాలను అడిగి తెలుసుకొని ఆయా పోలీసుస్టేషన్ అధికారులతో ఫోన్ చేసి మాట్లాడారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని సూచించారు. ఫిర్యాదు చేయడానికి వచ్చేవారిలో వృద్ధులు, నడవలేనిస్థితిలో ఉన్న మహిళలు వస్తుంటారని, అలాంటి వారి సమస్యలను సావదానంగా విని వారికి సత్వర న్యాయం అందిస్తామన్న భరోసా ఇవ్వాలని చెప్పారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని ప్రజలు స్థానిక పోలీసుస్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్లలో ఫిర్యాదులను అందజేయాలని చెప్పారు. కార్యక్రమంలో పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ దుర్గా ప్రసాద్, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, పామూరు సీఐ బీమానాయక్, కంభం సీఐ మల్లికార్జునరావు, మీకోసం వేదిక ఎస్సై జనార్దన్‌రావు పాల్గొన్నారు.

శనగ రైతులను ఆదుకోవాలి

- క్వింటా రూ.10 వేలకు ప్రభుత్వం కొనుగోలు చేయాలి
- కలెక్టరేట్ ముందు రైతుల ఆందోళన



ధర్నా చేస్తున్న రైతు సంఘాల నేతలు, రైతులు

ఒంగోలు సబర్బన్: శనగ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం వివిధ రైతు సంఘాల నేతలతో కలిసి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల వద్ద ఉన్న శనగ నిల్వలను క్వింటా రూ.10 వేల చొప్పున ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే క్వింటా శనగలకు రూ.3 వేల సబ్సిడీ ఇచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతుల వద్ద శనగల నిల్వలు పేరుకుపోయాయని, కనీస ధరలు లేక అమ్ముకోలేకపోతున్నారన్నారు. మరో వైపు కేంద్రం దిగుమతి సుంకాలు రద్దు చేయడం దారుణమన్నారు. ఆస్ట్రేలియా, కెనడా, టాంజానియా దేశాల నుంచి దిగుమతులు వస్తే రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. పప్పుదినుసులుగా ఉపయోగించే ఉత్పత్తులను దేశీయ అవసరాలకు తగినట్లుగా సాగు ఉత్పత్తులను నియంత్రించి ధరలు నిలకడగా ఉండేలా రైతులకు గిట్టుబాటు ధరలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దిగుమతి సుంకాలు పెంచి దిగుమతులను అడ్డుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్ పి.రాజాబాబుకు వినతిపత్రం అందజేశారు. వివిధ రైతు సంఘాల నేతలు జె.జయంత్ బాబు, కె.వీరారెడ్డి, చుంచు శేషయ్య, పరిటాల కోటేశ్వరరావు, జి.నాగేశ్వరరావు, బెజవాడ శ్రీనివాసు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంతో పారదర్శకత

- సేంద్రియ వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్ సుభాషిణి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సేంద్రియ వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్ సుభాషిణి

ఒంగోలు సబర్బన్: సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ వ్యవస్థల్లో పారదర్శకత పెరుగుతుందని సేంద్రియ వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్ వి.సుభాషిణి అన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆ విభాగం అధికారులు, సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ ప్రతి పౌరుడు తనకు అవసరమైన సమాచారాన్ని పొందడం ద్వారా బాధ్యతాయుతమైన పాలనను ప్రోత్సహించవచ్చని చెప్పారు. క్యాడర్ సభ్యులు గ్రామస్థాయిలో ప్రజలకు ఈ చట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ కార్యక్రమాన్ని పారదర్శకంగా అమలు చేయడంలో వారి పాత్ర కీలకమని అన్నారు. సమాచార హక్కు చట్టం ప్రాముఖ్యత, ప్రజలకు అవగాహన పెంపు గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా టీమ్ సభ్యులు, క్లస్టర్ కో ఆర్డినేటర్లు, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో రెండేళ్ల జైలు

ఒంగోలు: బైక్ చోరీ కేసులో నిందితునికి రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ ఒంగోలు ఎక్సైజ్ మేజిస్ట్రేట్ ఎస్ కోమలవల్లి సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2022 ఆగస్టు 14వ తేదీ రాత్రి 10 గంటలకు సంతనూతలపాడు ఎన్‌ఎస్‌పీ కాలనీ నివాసి మందాడి సత్యన్నారాయణ తన ఇంటిముందు బైక్ పార్కు చేసి నిద్రించాడు. మరుసటి రోజు ఉదయం బైక్ చోరీకి గురైనట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు ఒంగోలు జయప్రకాష్ కాలనీకి చెందిన మోటా నవీన్‌గా గుర్తించి ఆగస్టు 18న అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం నిందితునిపై నేరం రుజువైనట్లు పేర్కొంటూ నవీన్‌కు రెండేళ్ల జైలుశిక్ష విధించారు. నిందితులకు శిక్ష పడడంలో కృషి చేసిన ఏపీపీ శ్రావణ్‌కుమార్, సంతనూతలపాడు ఎస్సై అజయ్ బాబు, కోర్టు కానిస్టేబుల్ కె.వెంకట్రావులను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ప్రత్యేకంగా అభినందించారు.